రేషన్‌కార్డుల కోసం ఎదురుచూపులు

- సిబ్బంది తక్కువ.. విచారణలు ఎక్కువ
- టెన్షన్‌లో దరఖాస్తుదారులు
- అర్హులందరికీ వస్తాయంటున్న అధికారులు



ఖైరతాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఆహార భద్రత కార్డులకు పచ్చజెండా ఊపడంతో విచారణలు వేగంగా జరుగుతున్నాయి. దరఖాస్తుదారులు కార్డు రాదనే ఆందోళనతో కార్యాలయాల చుట్టూ తిరుగుతుండడం కనిపిస్తోంది. ఖైరతాబాద్‌లోని సర్కిల్-7 పౌరసరఫరాల కార్యాలయానికి ప్రతి రోజూ ఉదయం నుంచే పెద్ద ఎత్తున దరఖాస్తుదారులు వచ్చి తమకు రేషన్‌కార్డు వచ్చిందా? అని ఆరా తీస్తున్నారు. సిబ్బందికి సందర్శకుల సందేహాలను తీర్చేందుకే చాలా సమయం పడుతోందని, వారు వేగంగా పనిచేస్తేనే రేషన్‌కార్డులు వస్తాయని అధికారులు చెబుతున్నారు.

సిబ్బంది లేమితో ఆలస్యంగా విచారణలు

సర్కిల్-7 కార్యాలయం పరిధి చాలా పెద్దది. ఇందులో ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాలతో పాటు నాంపల్లి నియోజకవర్గం కొంత భాగం వస్తుంది. లక్షకు పైగా ఫుడ్ సెక్యూరిటీ కార్డులతో 81 మంది రేషన్‌డీలర్లతో ఉన్న ఈ పరిధిలో కొత్తగా వచ్చిన దరఖాస్తులను వేగంగా విచారించడంలో సిబ్బంది విఫలమవుతున్నారు. రేషన్ కార్డుల దరఖాస్తులను విచారించేందుకు కేవలం ఏడుగురు ఇన్‌స్పెక్టర్లు మాత్రమే పనిచేస్తున్నారు. వాస్తవానికి ఈ కార్యాలయంలో ఏడుగురు సీనియర్ ఇన్‌స్పెక్టర్లు, ఆరుగురు జూనియర్ ఇస్పెక్టర్లు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం కేవలం ఒక సీనియర్ ఇన్‌స్పెక్టర్, ఆరుగురు జూనియర్ ఇన్‌స్పెక్టర్లు విధులు నిర్వహిస్తున్నారు. దాదాపు అందరూ జూనియర్లే కావడంతో విచారణ మందకొడిగా సాగుతోంది. 10 సంవత్సరాల అనంతరం కొత్త రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ మొదలు కావడంతో పెద్ద ఎత్తున వచ్చిన దరఖాస్తులను విచారించేందుకు అదనపు సిబ్బందిని నియమిస్తామని ప్రభుత్వం ప్రకటించినా, ఇతర శాఖల సిబ్బందిని నియమించకపోవడంతో ఉన్న తక్కువ సిబ్బందితో వేగంగా విచారణలు చేయలేకపోతున్నారు.

కార్డుల జారీ సుదీర్ఘ ప్రక్రియే..

రేషన్‌కార్డుల కోసం వేలాదిగా వచ్చిన దరఖాస్తులను అన్ని కోణాల్లో విచారించిన అనంతరమే కార్డుల మంజూరు జరుగుతుంది. మొదట దరఖాస్తులను ఆన్‌లైన్ చేయగానే 360 డిగ్రీల కోణంలో ఫిల్టర్ అవుతుంది. ఆహార భద్రత కార్డు కోసం ఏడాదికి రెండు లక్షల ఆదాయానికి మించి ఉండకపోవడం, దరఖాస్తుదారుడి వ్యవసాయ భూమి వివరాలు, సొంతింటి వివరాలు, ఆదాయపు పన్ను వివరాలు, వాహనాల వివరాలు ఆధార్ అనుసందానంతో తెలుస్తాయి. వెంటనే మొదటి ఫిల్టర్ నివేదిక ఆన్‌లైన్‌లో చూపిస్తుంది. అనంతరం దరఖాస్తులను సంబంధిత ఇన్‌స్పెక్టర్‌కు ఇస్తారు. వారు విచారించి నివేదిక సమర్పించిన అనంతరం ఆ వివరాలను ఆన్‌లైన్‌లో చేర్చి సంబంధిత నివేదికతో పాటు పత్రాలను స్కాన్ చేస్తారు. అనంతరం దానిని సంబంధిత సర్కిల్ ఏఎస్‌వో ధ్రువీకరించి నివేదిక ఇస్తూ ఆమోదించడమో.. తిరస్కరించడమో చేస్తారు. అక్కడి నుంచి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఆమోదిస్తే అక్కడి నుంచి కమిషనర్ ఆమోదిస్తేనే ఆహార భద్రతా కార్డు సిద్ధమవుతుంది. ఈ ప్రక్రియ పూర్తిగా అయ్యే వరకు ఆన్‌లైన్‌లో పెండింగ్ అని చూపిస్తుంది.

సర్కిల్-7 (ఖైరతాబాద్) పౌరసరఫరాల శాఖ కార్యాలయం పరిధిలో రేషన్ కార్డుల కోసం, కొత్తగా పేర్ల నమోదుకు, పేర్ల తొలగింపు కోసం వచ్చిన దరఖాస్తులు, వాటి వివరాలు 4వ తేదీ వరకు ఇలా ఉన్నాయి..

రేషన్‌కార్డుల కోసం వచ్చిన మొత్తం దరఖాస్తులు	19,740
ఆమోదించబడ్డ కార్డులు	3,723
కొత్తగా వచ్చిన కార్డులపై రేషన్ తీసుకుంటున్నవారు	189
పాత కార్డుల్లో పేర్ల తొలగింపునకు వచ్చిన దరఖాస్తులు	5,300
పాత కార్డుల్లో కొత్త పేర్ల నమోదు దరఖాస్తులు	19,433
కొత్తగా పేర్లు చేర్చిన కార్డులు	12,007

దరఖాస్తుదారులు ఆందోళన చెందవద్దు

రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఎలాంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదు. అర్హత ఉన్న అందరికీ ఆహార భద్రతా కార్డులను అందజేస్తాం. ప్రతీ దరఖాస్తును సమగ్రంగా విచారించి న్యాయం చేస్తాం. రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ నిరంతరం కొనసాగుతూనే ఉంటుంది. కొత్తగా పేర్లు చేర్చడం కోసం వచ్చిన దరఖాస్తులను సైతం విచారించి పేర్లను చేర్చుతున్నాం. కొత్తగా ఆమోదింపబడ్డ రేషన్‌కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ సైతం ప్రారంభమైంది. అందరికీ న్యాయం జరుగుతుంది.

\- బి.జ్యోతి, సహాయ పౌరసరఫరాల అధికారి, సర్కిల్-7, ఖైరతాబాద్



చేనేతవస్త్రాలను తిలకిస్తున్న మంత్రి సీతక్క

చేనేతవస్త్రాలపై కేంద్రం జీఎస్టీ తగ్గించాలి

- మంత్రి సీతక్క

యూసు‌ఫ్‌గూడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చేనేత వస్త్రాలు ధరించి చేనేత పరిశ్రమకు తోడ్పాటు అందించాలని, కేంద్ర ప్రభుత్వం చేనేతకారులకు జీఎస్టీని తగ్గించాలని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు. శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన సిల్క్ ఎగ్జిబిషన్‌ను శనివారం మంత్రి ప్రారంభించారు. చీరలు అందంగా, ఆకర్షణతో ఆకట్టుకునేలా ఉన్నాయన్నారు. చేనేత ఉత్పత్తులను తిలకించారు. వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేనేత కళాకారులకు చేయూతను అందిస్తూ వారి అభ్యున్నతికి తోడ్పడుతుందని అన్నారు. దేశంలోని ప్రముఖ రాష్ట్రాలకు చెందిన చేనేత ఉత్పత్తులను ఒక వేదికగా చేర్చి వినియోగదారులకు అందించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. సిల్క్ ఇండియా సీఈఓ వినయ్ కుమర్ మాట్లాడుతూ దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత ఉత్పత్తులు సుమారు 70 స్టాల్స్‌లో ఏర్పాటు చేశామన్నారు. కొల్‌కత్తాతోపాటు పలు నగరాలకు చెందిన విభిన్నమైన, అరుదైన చీరలను ఏర్పాటు చేశామని, ఈనెల 13 వరకు ఎగ్జిబిషన్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రఘునందన్‌రావును పరామర్శిస్తున్న చింతల

ఎంపీ రఘునందన్‌రావుకు పరామర్శ

ఖైరతాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మోకాలి శస్త్ర చికిత్స చేయించుకొని విశ్రాంతి తీసుకుంటున్న మెదక్ ఎంపీ, బీజేపీ నేత రఘునందన్‌రావును బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల రామచంద్రారెడ్డి శనివారం పరామర్శించారు. ఎంపీని ఆయన నివాసంలో కలిసిన చింతల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.

మహిళల భద్రతకు పెద్దపీట

- సీపీ అవినాష్ మహంతి

హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మహిళల భద్రత కోసం ఉమెన్ సేఫ్టీ వింగ్ నిరంతరం పనిచేస్తోందని సీపీ అవినాష్ మహంతి అన్నారు. వారం రోజుల వ్యవధిలో (జూన్ 29 నుంచి జూలై 5 వరకు) కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 154 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించారు. మహిళలను, యువతులను వేధిస్తున్న వారిపైన, ఆన్‌లైన్‌లో వేధింపులకు గురిచేస్తున్న వారిపైన 57 కేసులు నమోదు చేశారు. మహిళల భద్రతపైన ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో 85 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గృహహింసకు సంబంధించి మహిళా పోలీస్‌స్టేషన్‌లో 29 ఫిర్యాదులు రాగా, వాటిలో 11 మందిపై కేసులు నమోదు చేశారు. మిగతా జంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ బృందం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో దాడులు చేసి వ్యభిచారం చేస్తున్న ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు 9 మంది యువతులను రక్షించారు. ఆపరేషన్ ముస్కాన్ 11లో భాగంగా 74 మంది చిన్నారులను కాపాడిన పోలీసులు, 69 మంది పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించారు. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై 23 కేసులు నమోదు చేశారు. భరోసా సెంటర్‌లో కుటుంబకలహాలతో వచ్చిన 31 జంటలకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

భక్తులను ఇబ్బంది పెట్టిన 22 మందిపై కేసు

అమీర్‌పేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ రథోత్సవంలో వేర్వేరు చోట్ల గొడవలు సృష్టించి, భక్తులను ఇబ్బందులకు గురిచేసిన 22 మంది యువకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. బల్కంపేట రోడ్డులోని ఎస్ఎస్ బేకరీ, వేంకటేశ్వర ఆలయం, బతుకమ్మ చౌరస్తా ప్రాంతంలో గుమిగూడి, పెద్దగా కేకలు వేస్తూ, రథోత్సవంలో పాల్గొన్న భక్తుల పట్ల దుర్భాషలాడుతూ, జన సమూహంలోకి దూసుకెళ్లేందుకు కొందరు యువకులు ప్రయత్నిస్తున్నారంటూ అందిన ఫిర్యాదు మేరకు ఎస్ఆర్‌నగర్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. యువకులను అదుపులోకి తీసుకున్నారు. 22 మందిపై కేసు నమోదు చేశారు.

భక్తురాలి మెడలోని బంగారు గొలుసు చోరీ

అమీర్‌పేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆలయానికి వచ్చిన భక్తురాలి మెడలోని బంగారు గొలుసును దొంగ అపహరించుకెళ్లాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్‌కు చెందిన ఎన్.కమల(62) ఈనెల 2వ తేదీ మధ్యాహ్నం అమీర్‌పేట్‌లోని శ్రీ కనకదుర్గ ఆలయానికి వచ్చి పూజలు నిర్వహించారు. ఆరోజు సాయంత్రం వరకు ఆలయంలోనే ఉండిపోయింది. ఆలయం ప్రధాన ద్వారం వద్ద ప్రసాదం పంచుతుండగా, గుర్తు తెలియని వ్యక్తి ఆమె మెడలోని 55 గ్రాముల మంగళసూత్రాన్ని కాజేశాడు. బాధితురాలికి జ్వరం రావడంతో ఫిర్యాదు చేయడంలో ఆలస్యమైందని పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నాలాలో గుర్తు తెలియని మృతదేహం

బేగంపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఓ గుర్తు తెలియని మృతదేహం కొంత భాగం నాలాలో కొట్టుకు వచ్చింది. ఈ సంఘటన బేగంపేటలోని రసూల్‌పుర ఇందిరమ్మనగర్ నాలా వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందిరమ్మనగర్ వద్ద నాలాలో శుక్రవారం సాయంత్రం 5.30 గంటల ప్రాంతంలో మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కాలిన స్థితిలో మృతదేహంలోని కొంతభాగం నాలాలో తేలుతుండడాన్ని గుర్తించి వెలికి తీశారు. గాంధీ మార్చురీకి ఆ భాగాన్ని తరలించారు. శ్మశానంలో కాలిన మృతదేహంలోని కొంత భాగం నాలాలో పడి కొట్టుకువచ్చి ఉండవచ్చని బేగంపేట ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌రావు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



ఖైరతాబాద్‌లోని టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో నూతన డైరెక్టర్లు సిహెచ్.చక్రపాణి, శివాజీ, కృష్ణారెడ్డిలకు తెలంగాణ ఎలక్ట్రికల్ ఏ గ్రేడ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు శనివారం శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎం.శ్రీనివాస్‌గౌడ్, ఎలక్ట్రికల్ లైసెన్సింగ్ బోర్డు సభ్యుడు నేమాల బెనర్జీ, మాజీ సభ్యుడు నక్క యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

● హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి



మొహర్రంను పురస్కరించుకొని ఎర్రమంజిల్ కాలనీలో పీర్లను దర్శించుకున్న కార్పొరేటర్ పి.విజయారెడ్డి

● పంజాగుట్ట, ఆంధ్రజ్యోతి

ఏవోసీ సెంటర్‌లో అగ్నివీరుల రిక్రూట్‌మెంట్ ర్యాలీ

- ఈనెల 31 నుంచి సెప్టెంబర్ 14 వరకు నిర్వహణ

అల్వాల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అగ్నివీరుల రిక్రూట్‌మెంట్ ర్యాలీ తేదీలు ఖరారయ్యాయి. ఈనెల 31 నుంచి సెప్టెంబరు 14 వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు రక్షణశాఖ పౌరసంబంధాల అధికారి శివహరి నాయక్ తెలిపారు. సికింద్రాబాద్‌లోని ఏవోసీ సెంటర్ జోగిందర్‌సింగ్ స్టేడియంలో ఈ ర్యాలీలు జరగనున్నాయి. ఈ నియామకాల్లో భాగంగా అగ్నివీర్ జనరల్ డ్యూటీ(జీడీ), అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ పోస్టులను భర్తీ చేయనున్నారు. వివిధ కేటగిరీల్లో అత్యుత్తమ క్రీడాకారులకు ప్రత్యేక స్పోర్ట్స్ ట్రయల్స్ కూడా ఉంటాయని అధికారులు చెప్పారు. ఇందుకోసం జూలై 31న ఉదయం 6 గంటలకు జోగిందర్‌సింగ్ స్టేడియంలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. పలు అథ్లెటిక్స్ రంగాలలో జాతీయ లేదా అంతర్జాతీయ స్థాయి క్రీడా సర్టిఫికెట్లు అవసరమని తెలిపారు. మరింత సమాచారం కోసం హెడ్‌క్వార్టర్ ఏవోసీ సెంటర్‌ను లేదా www.joinindianarmy.nic.inను సందర్శించాలని పేర్కొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర

యూసుఫ్‌గూడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.45లోని ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో జగన్నాథుడి రథయాత్ర శనివారం వైభవంగా జరిగింది. ఊరేగింపులో ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి జగన్నాథస్వామి రథచక్రాలకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బోజిరెడ్డి, అనిల్ కుమార్, నిర్వాహకులు పాల్గొన్నారు.

హరిహరక్షేత్రంలో 10న గురుపౌర్ణమి వేడుకలు

బోరబండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): బోరబండ స్వరాజ్‌నగర్‌లోని శ్రీ హరిహరక్షేత్రంలో ఈనెల 10న గురుపౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కల్వల సత్యనారాయణరావు తెలిపారు. ఉదయం షిర్డీ సాయిబాబాకు జలాభిషేకం, అనంతరం పంచామృతాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

నాలాల పూడికతీతలో టెక్నాలజీని ఉపయోగించాలి

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

యూసుఫ్‌గూడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నాలాల పూడికతీత, చెత్తను శుభ్రం చేసేందుకు టెక్నాలజీని ఉపయోగించి శాశ్వత పరిష్కారం చూపించాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం కృష్ణానగర్ బీ బ్లాక్‌లో వర్షపునీటి నాలాను, శిథిలావస్థలో ఉన్న బస్తీ రోడ్లను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు బీ బ్లాక్‌లో కొన్ని సంవత్సరాలుగా నెలకొన్న పలు సమస్యలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం జరిగిన సభలో సమస్యలకు సంబంధించిన అధికారులతో ముఖాముఖి మాట్లాడించారు. వేసవికాలంలో చేయాల్సిన నాలా పూడికతీత పనులను జూలై వచ్చినా చేయకుంటే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. పనులు చేయకుండానే నిధులు మంజూరు చేయడం వల్ల కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కిషన్‌రెడ్డి అన్నారు. నాలా పూడికతీతపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో ఆయ విభాగాల అధికారులతోపాటు బీజేపీ నాయకులు లంకాల దీపక్‌రెడ్డి, కుంబాల గంగరాజు, ప్రేమ్‌కుమార్, ప్రశాంత్, కాట్రాజ్, లక్ష్మీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ రోస్టర్ విధానంతో మాలలకు తీవ్ర అన్యాయం

- ఆగస్టు 1న ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల బ్లాక్ డే



అభివాదం చేస్తున్న మాల సంఘాల నాయకులు

పంజాగుట్ట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ రోస్టర్ విధానంతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ ఆరోపించారు. ఆగస్టు 1వ తేదీని ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల బ్లాక్ డేగా ప్రకటిస్తున్నామని, ఆ రోజు నగరాన్ని అష్టదిగ్బంధనం చేసి రేవంత్‌రెడ్డి సర్కార్‌కు మాలల సత్తా ఏమిటో చూపిస్తామని ఆయన హెచ్చరించారు. మాల సంఘాల ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎస్సీ ఉప వర్గీకరణ చట్టం-2025 రోస్టర్ విధానం వల్ల మాలలకు జరుగుతున్న అన్యాయం- భవిష్యత్తు కార్యాచరణపై చర్చ జరిగింది. బత్తుల రాంప్రసాద్ కన్వీనర్‌గా వ్యవహరించిన ఈ సదస్సుకు డాక్టర్ మంచాల లింగస్వామి సభాధ్యక్షత వహించారు. ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ మాల సంఘాలు, మాల విద్యార్థి సంఘాలు, మాల నిరుద్యోగ సంఘాల నాయకులు మాట్లాడారు. మాలలను గ్రూపు-3లో చేర్చి రోస్టర్ పాయింట్ 22 కేటాయించడం ద్వారా తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ శాఖలలో 15 నుంచి 20 ఉద్యోగాలు మాత్రమే విడుదల చేస్తే మాలలకు అసలు దరఖాస్తు చేసుకునే హక్కు కూడా లేకుండా పోతుందన్నారు. గ్రూపు-3 రోస్టర్ పాయింట్‌ను 22 నుంచి 16కు మార్చేంత వరకు పోరాటం చేస్తామని అన్నారు. మాల కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.7500 కోట్ల బడ్జెట్ కేటాయించాలని, నగరంలో మాల భవన్ కోసం భూమిని, భవన నిర్మాణానికి నిధులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో కో-ఆర్డినేటర్ ఆవుల సుధీర్, సీనియర్ జర్నలిస్టు ఆస శ్రీరాములు, వివిధ మాల సంఘాల నాయకులు కరణం కిషన్, గోపోజు రమేష్, పసుల రామ్మూర్తి, సుదమల్ల అంజలి, ఇందిర, రేణు, మైస నాందేవ్, రాహుల్ మధునూరి, మణిదీప్, ఆదర్శ మౌర్య, విశాల్, సామ శ్రీనివాస్, నామ సైదులు, ఎస్.పవన్, అరుణ్ నంద పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడపొద్దు

- పంజాగుట్ట చౌరస్తాలో ప్లకార్డుల ప్రదర్శన



పంజాగుట్ట చౌరస్తాలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువకులు

పంజాగుట్ట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడపవద్దంటూ ఒకవైపు ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నా వాహనదారులు పెడచెవిన పెడుతున్నారు. పంజాగుట్ట ట్రాఫిక్ పీఎస్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 70 మందిని పోలీసులు నాంపల్లిలోని జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ 9వ కోర్టులో శనివారం హాజరుపరిచారు. మెజిస్ట్రేట్ కె.శ్రీవాణి ఆయా కేసులను విచారించి తీర్పు వెలువరించారని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పీవీ రాంప్రసాద్‌రావు తెలిపారు. మొదటిసారి పట్టుబడిన 49 మందికి ఒక్కొక్కరికి రూ.2,100 జరిమానా, మరో నలుగురికి రూ.2,100 జరిమానాతోపాటు కోర్టు సమయం ముగిసే వరకు కోర్టులో నిలబడి ఉండాలని, రెండోసారి పట్టుబడిన 17 మందికి ఒక్కొక్కరికి రూ.3,300 చొప్పున జరిమానాతో పాటు ఒక రోజు పీఎస్ పరిధిలోని చౌరస్తాలో సామాజిక సేవ చేయాలని తీర్పు చెప్పారని ఆయన తెలిపారు. మెజిస్ట్రేట్ తీర్పుతో శనివారం పంజాగుట్ట చౌరస్తాలో ఆ 17 మంది మద్యం తాగి వాహనాలు నడపవద్దంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ వాహనదారులకు అవగాహన కల్పించారు.

తాగునీరు సరఫరా చేసే వాల్వ్ పైన కారు పార్కింగ్

- మధురానగర్ డి-బ్లాక్‌లో నిలిచిన నీటి సరఫరా



తాగునీరు సరఫరా చేసే వాల్వ్‌పైన నిలిపిన కారు

వెంగళరావునగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వాహనదారుడి నిర్లక్ష్యం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాగునీరు సరఫరా చేసే నీటి వాల్వ్ పైన ఓ వ్యక్తి తన కారును పార్క్ చేసిన వెళ్లిపోయాడు.దీంతో తాగునీటి వాల్వ్ తిప్పడానికి వచ్చిన జలమండలి సిబ్బందికి ఏమి చేయాలో పాలుపోలేదు. శనివారం మధురానగర్ డి-బ్లాక్ వాసులకు నీటిని సరఫరా చేసేందుకు జలమండలి ఉద్యోగి అయ్యప్ప మైదానం వద్ద ఉన్న వాల్వ్ తిప్పడానికి వచ్చాడు. వాల్వ్ పైనే ఓ వ్యక్తి తన కారును నిలిపి వెళ్లిపోయాడు. ఆ ఉద్యోగి స్థానికులకు, కాలనీ సంక్షేమ సమితి ప్రతినిధులకు సమాచారం ఇచ్చాడు. వారు ట్రాఫిక్ పోలీసులకు చెప్పారు. ఆ నెంబర్ ఆధారంగా కారు యజమానికి ఫోన్ చేయగా వేరే వారి నెంబర్ ఇచ్చాడని, వారికి ఫోన్ చేస్తే ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నాడని కాలనీ ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు, కాలనీవాసి డి.సత్యనారాయణ ఆరోపించారు. కారును ముం దుకు నెట్టుదామన్నా హ్యాండ్ బ్రేక్ వేసి ఉండడంతో కదలడం లేదని వారు తెలిపారు. శనివారం మధ్యాహ్నం నీరు సరఫరా కాకపోవడంతో బోరు లేని ఇంటి వారు ఇబ్బందులు పడ్డారు. అసలే రోజు విడిచి రోజు సరఫరా అవుతున్న నీరు సరిపోక ఇబ్బందులు పడుతుంటే ఓ వ్యక్తి నిర్లక్ష్యానికి ఇబ్బందులు పడ్డామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వాల్వ్ పై నుంచి కారును తొలగించిన తర్వాత తమకు తాగునీటిని సరఫరా చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.



సోమాజిగూడలో ఓ దుకాణాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

లైసెన్స్ తీసుకోకపోతే దుకాణాలు సీజ్

ఖైరతాబాద్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రతీ వ్యాపారి విధిగా వ్యాపార లైసెన్స్ తీసుకోవాలని, లేకుంటే దుకాణాలను సీజ్ చేయక తప్పదని జీహెచ్ఎంసీ సర్కిల్-17 ఉపకమిషనర్ రజనీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం సర్కిల్ పరిధిలోని సోమాజిగూడలో రెండు, అమీర్‌పేటలో రెండు దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్‌లు లేకపోవడంతో సీజ్ చేశారు. ఏఎంసీ కైలాష్, సూపరింటెండెంట్ రమేష్‌తో పాటు సిబ్బంది తనిఖీలు చేశారు. ఇందులో రెండు హోటళ్లతో పాటు రెండు దుకాణాలు ఉన్నాయి. సీజ్ చేసిన అనంతరం రెండు హోటళ్ల వారు లైసెన్స్‌లను పునరుద్ధరించుకోవడంతో వాటిని తెరిపించినట్లు ఉపకమిషనర్ తెలిపారు.

లష్కర్ బోనాలకు పకడ్బందీ ఏర్పాట్లు

సజావుగా నిర్వహించడంపై అధికార యంత్రాంగం దృష్టి

సికింద్రాబాద్, జూలై 5(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి బోనాల జాతరను సమర్థవంతంగా నిర్వహించడంపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. ఈ నెల 13, 14వ తేదీల్లో బోనాల జాతరను అత్యంత వైభవంగా జరపడానికి ప్రభుత్వంలోని ఆయా విభాగాల అధికారులు శ్రమిస్తున్నారు. సాధారణ భక్తులకు, బోనాలతో వచ్చే మహిళలకు, వీఐపీలకు ప్రత్యేక క్యూ లైన్ల ఏర్పాటు, ఆలయం పరిసరాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అదనపు సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. పోలీసు సిబ్బంది నియామకం, ఆలయం చుట్టుపక్కల తాగునీరు, మురుగునీరు లీకేజీలను అరికట్టడం, జాతరకు వచ్చే భక్తులకు స్వాగతం పలుకుతూ తోరణాల ఏర్పాటు, ఆలయం చుట్టుపక్కల వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా చూడడం తదితర పనులపై ఆయా విభాగాల అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, స్థానిక సనత్‌నగర్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్‌యాదవ్, జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్, బేగంపేట్ సర్కిల్ ఉపకమిషనర్ డాకునాయక్, ఉత్తర మండల డీసీపీ రష్మీ పెరుమాళ్, మహంకాళి ఏసీపీ సైదయ్య, ఇన్‌స్పెక్టర్ పరశురామ్ తదితర ఉన్నతాధికారులు జాతర ఏర్పాట్లపై నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. కాగా తెలుగు రాష్ట్రాలతోపాటు దేశ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన ఉజ్జయినీ మహాకాళి బోనాల జాతరకు రావలసిందిగా ఈపాటికే సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించిన ఆలయ అధికారులు తాజాగా శనివారం కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అసెంబ్లీ మాజీ స్పీకర్, సికింద్రాబాద్ శాసనసభ్యుడు టి.పద్మారావుగౌడ్ తదితర ప్రముఖులను ఆహ్వానించారు. వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి, ఆలయ అర్చకులు ఆహ్వాన పత్రికలు అందచేసి 13, 14వ తేదీల్లో జరిగే బోనాల జాతరకు రావలసిందిగా కోరారు. జాతర ఏర్పాట్లపై వారికి వివరించారు.


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న మనోహర్‌రెడ్డి


ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఆహ్వానపత్రిక అందచేస్తున్న మనోహర్‌రెడ్డి


మహాకాళి అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు


ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌ను ఆహ్వానిస్తున్న మనోహర్‌రెడ్డి


నిర్వాహకులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీసీపీ రష్మీ పెరుమాళ్

జాతర నిర్వహణకు అందరూ సహకరించాలి

● ఉత్తర మండల డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్

రాంగోపాల్‌పేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : బోనాల జాతర నిర్వహణకు అందరూ సహకరించాలని ఉత్తర మండల డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ కోరారు. శనివారం సికింద్రాబాద్ సోమసుందరం వీధిలోని విశ్వకర్మ సంఘ భవనంలో రానున్న బోనాల పండుగ ఏర్పాట్లను పురస్కరించుకొని ఫలహారపు బండ్ల నిర్వాహకులు, షాపుల యజమానులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫలహారపు బండ్లు తీసేవారు ముందస్తుగా పోలీసులకు సమాచారం ఇస్తే వారి రూట్‌కు తగినట్లు బందోబస్తు ఏర్పాట్లు చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. మహంకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి దేవాలయం చుట్టు పక్కన బారీకేడ్లను ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా షాపుల యజమానులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రతి షాపులో నూతన సీసీ కెమారాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశంలో మహంకాళి ఏసీపీ సైదయ్య, ఇన్‌స్పెక్టర్లు పరశురామ్, ఉత్తర మండలంలోని పలు పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఫలహారం బండ్ల నిర్వాహకులు, వివిధ షాపుల యజమానులు, ప్రతినిధులు పాల్గొన్నారు.


రోడ్ల ఆక్రమణలను తొలగిస్తున్న ఏసీపీ శంకర్ రాజు, ఎస్ఐ విజయ సిబ్బంది

అక్రమ కట్టడాల తొలగింపు

బోయినపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హస్మత్‌పేట అంబేద్కర్ చౌరస్తాలో రోడ్డు పక్కన బస్‌స్టాప్‌లో నిర్మించి పలు అక్రమ కట్టడాలను ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు ఆధ్వర్యంలో శనివారం తొలగించారు. ఇటీవల హస్మత్‌పేట, దుబాయిగేట్ తదితర ప్రాంతాల్లో జరిగిన పలు రోడ్డు ప్రమాదాల దృష్ట్యా నిత్యం ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో ప్రజల ఫిర్యాదుల మేరకు ఈ అక్రమ కట్టడాలను తొలగించినట్లు నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు తెలిపారు. జాయింట్ పోలీస్ కమిషనర్ జోయల్ డేవిస్, ట్రాఫిక్ డీసీపీలు రాహుల్ హెగ్డే, వేణుగోపాల్ రెడ్డిల ఆదేశాల మేరకు ఈ అక్రమ కట్టడాలను తొలగించినట్లు ఏసీపీ తెలిపారు. మరలా ఎవరైనా ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

టీఎంఓఏ మేడ్చల్ జిల్లా కార్యవర్గ ఎన్నిక

బోయినపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా తెలంగాణ మీసేవ ఆపరేటర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ఎన్నికలు శనివారం ఏఎంఆర్ గార్డెన్‌లో జరిగాయి. జిల్లా అధ్యక్షుడుగా కె.సాగర్ బాబు, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, కోశాధికారిగా సంతోష్ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా తోట సుధీర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ప్రదీప్‌వర్మ, బాలకృష్ణ, కార్యదర్శులుగా రాహుల్, క్రిష్ణారెడ్డి, సభ్యులుగా వాజీద్ అలీ, లింగం, నవీన్‌కుమార్ ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ సభ్యులతో రాష్ట్ర అధ్యక్షుడు జీవన్ ప్రసాద్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు రాఘవేందర్ రావు, జగదీశ్వర్, శర్మ, శ్రీకాంత్, అశ్విన్ గౌడ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏవోసీ సెంటర్‌లో అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

● ఈనెల 31 నుంచి సెప్టెంబర్ 14 వరకు నిర్వహణ

అల్వాల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ ర్యాలీ తేదీలు ఖరారయ్యాయి. ఈ నెల 31 నుంచి సెప్టెంబరు 14 వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు రక్షణశాఖ పౌరసంబంధాల అధికారి శివహరి నాయక్ తెలిపారు. సికింద్రాబాద్‌లోని ఏవోసీ సెంటర్ జోగిందర్‌సింగ్ స్టేడియంలో ఈ ర్యాలీలు జరగనున్నాయి. ఈ నియామకాల్లో భాగంగా అగ్నివీర్ జనరల్ డ్యూటీ (జీడీ), అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ పోస్టులను భర్తీ చేయనున్నారు. వివిధ కేటగిరీల్లో అత్యుత్తమ క్రీడాకారులకు ప్రత్యేక స్పోర్ట్స్ ట్రయల్స్ కూడా ఉంటాయని అధికారులు చెప్పారు. ఇందుకోసం జూలై 31న ఉదయం 6 గంటలకు జోగిందర్‌సింగ్ స్టేడియంలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. పలు అథ్లెటిక్స్ రంగాలలో జాతీయ లేదా అంతర్జాతీయ స్థాయి క్రీడా సర్టిఫికెట్లు అవసరమని తెలిపారు. సమాచారం కోసం హెడ్ క్వార్టర్ ఏవోసీ సెంటర్‌ను లేదా www.joinindianarmy.nic.in ను సందర్శించాలని పేర్కొన్నారు.

మహిళల భద్రతకు పెద్దపీట : సీపీ అవినాష్ మహంతి


హైదరాబాద్ సిటీ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మహిళల భద్రత కోసం ఉమెన్ సేఫ్టీ వింగ్ నిరంతరం పనిచేస్తోందని సీపీ అవినాష్ మహంతి అన్నారు. వారం రోజుల వ్యవధిలో (జూన్ 29 నుంచి జూలై 5 వరకు) కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో 154 డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించారు. మహిళలను, యువతులను వేధిస్తున్న వారిపై, ఆన్‌లైన్‌లో వేధింపులకు గురిచేస్తున్న వారిపై 57 కేసులు నమోదు చేశారు. మహిళల భద్రతపై ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో 85 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గృహహింసకు సంబంధించి మహిళా పోలీస్‌స్టేషన్‌లో 29 ఫిర్యాదులు రాగా వాటిలో 11 మందిపై కేసులు నమోదు చేశారు. మిగతా జంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ బృందం ఆధ్వర్యంలో పలు ప్రాంతాల్లో దాడులు చేసి వ్యభిచారం చేస్తున్న ఇద్దరు ట్రాన్స్‌జెండర్లు 9 మంది యువతులను రక్షించారు. ఆపరేషన్ ముస్కాన్ 11లో భాగంగా 74 మంది చిన్నారులను కాపాడిన పోలీసులు, 69 మంది పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించారు. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై 23 కేసులు నమోదు చేశారు. భరోసా సెంటర్‌లో కుటుంబ కలహాలతో వచ్చిన 31 జంటలకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

తిరుకల్యాణ మహోత్సవం

రెజిమెంటల్‌బజార్, జూలై 5(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్‌లోని పాండురంగ విఠలేశ్వర వేంకటాద్రిస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజు శనివారం విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణం, యాగశాల ఆరాధన, మూర్తి కుంభ ఆరాధన, రాధా రుక్మిణి సమేత పాండురంగ విఠలేశ్వర స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ అల్లాడి గౌరిశంకర్, ఈఓ సత్యనారాయణ, కమిటీ సభ్యులు నందికంటి రవి, శ్రీనివాస్, కీర్తివీరేష్,పరమేశ్వరి భక్తులకు ఏర్పాట్లు చేశారు. పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కనుల పండువగా గోరింటాకు ఉత్సవం

చిలకలగూడ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మెట్టుగూడ దూద్‌బావి కమిటీ హాల్‌లో శనివారం టీం వి ఫర్ యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోరింటాకు ఉత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. గోరింటాకు సౌందర్య పోషణతో పాటు శరీరంలో వేడి తగ్గించటానికి దోహదం చేస్తుందని తెలిపారు. ఆషాఢ మాసంలో మహిళలు తప్పకుండా గోరింటాకు పెట్టుకుని ప్రాచీన సంప్రదాయాలు కాపాడి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని ఫౌండేషన్ అధ్యక్షురాలు భానుమతి సుంకరి సూచించారు.


గోరింటాకు ఉత్సవంలో మహిళలు

సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ మహిళా జాయింట్ కన్వీనర్‌కు సన్మానం

అడ్డగుట్ట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం మహిళా జాయింట్‌కన్వీనర్‌గా నియమితులైన ఉమకు శనివారం తుకారాంగేట్‌లోని పహాడి హనుమాన్ ఆలయంలో చైర్మన్ లక్ష్మణ్ ప్రసాద్, రమేష్‌లు ఆమెకు ఘనంగా సన్మానం చేశారు. ఆమెకు ఈ పదవి రావడంతో ఆనందంగా ఉందని ఆలయ ధర్మకర్తలు, ఆ పార్టీ సీనియర్ నాయకులు తెలిపారు.

బోనాలను ఘనంగా జరుపుకుందాం: తలసాని

సికింద్రాబాద్, జూలై 5(ఆంధ్రజ్యోతి): బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకుందామని సనత్‌నగర్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం ఉజ్జయినీ మహాకాళి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని 268 ఆలయాలకు ఉత్సవాల నిర్వహణకు కోటి 62లక్షల రూపాయిల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ఈ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించాలని ఉమ్మడి రాష్ట్రంలో డిమాండ్ చేసినా అమలుకు నోచుకోలేదని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత నాటి సీఎం కేసీఆర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించి, ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్టు గుర్తు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని ఆలయాల అలంకరణ, ఉత్సవాల కోసం సద్వినియోగం చేసుకోవాలని తలసాని కోరారు.


ఆలయాల నిర్వాహకులకు బోనాల చెక్కులు పంపిణీ చేస్తున్న తలసాని

మమ్మల్ని పిలవండి: డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత

సమావేశానికి హాజరైన గ్రేటర్ హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత మాట్లాడుతూ బోనాల చెక్కులు తీసుకునేందుకు వచ్చిన ఆలయాల నిర్వాహకులు తనను అన్ని దేవాలయాల్లో జరిగే బోనాల జాతరకు ఆహ్వానించాలని కోరారు. దీనికి తలసాని నవ్వుతూ.... ఎన్ని ఆలయాలకని వెళతారు! అని ప్రశ్నించారు. దాంతో సమావేశంలో నవ్వులు విరిశాయి. కాగా కార్పొరేటర్లు కుర్మ హేమలత, టి.మహేశ్వరి, కొంతం దీపిక, సికింద్రాబాద్ తహసీల్దార్ పాండు నాయక్, దేవాదాయ శాఖ అధికారులు శ్రీనివాస్‌శర్మ, శ్రీదేవి, మహంకాళి ఏసీపీ సైదయ్య, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రంగారెడ్డి, మహంకాళి ఆలయ అనువంశిక ధర్మకర్త సురిటి రామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

భారీ ఏర్పాట్లు : కోట నీలిమ

బోనాల ఉత్సవాల సందర్భంగా అమ్మవారి దర్శనానికి లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేస్తున్నదని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం బోనాల జాతరను మరింత వైభవంగా నిర్వహించనున్నట్టు ఆమె చెప్పారు.

స్టాంప్ వెండర్ల స్టాల్స్ కూల్చివేత

అడ్డగుట్ట, మారేడుపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి):సికింద్రాబాద్ సివిల్ కోర్టు బయట, సికింద్రాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదురుగా ఫుట్‌పాత్‌పై ఉన్న రబ్బర్ స్టాంపులు, స్టాంప్ వెండర్ల స్టాళ్లను శనివారం జీహెచ్‌ఎంసీ సిబ్బంది కూల్చివేశారు. కొన్నేళ్లుగా పొట్టకూటి కోసం స్టాంప్ వెండర్లు ఇక్కడ వ్యాపారం చేసుకుంటున్నారు. సికింద్రాబాద్ కోర్టు పరిధిలో అధికారంగా, అనధికారంగా ఉన్న స్టాంప్ వెండర్ల స్టాళ్లను కూల్చివేయడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఫుట్‌పాత్‌పై ఉన్న కారణంగానే కూల్చివేస్తున్నామని జీహెచ్‌ఎంసీసిబ్బంది తెలిపారు.

బ్రోకర్లదే రాజ్యం

సికింద్రాబాద్ కోర్టు బయట ఫుట్‌పాత్‌పై అనధికారంగా ఉన్న స్టాంప్ వెండర్లు డాక్యుమెంట్ల కోసం వచ్చే ప్రజలు నుంచి ఇష్టానుసారంగా చార్జీలు వసూలు చేస్తున్నారు. ఈ విషయమై కొన్నేళ్ల నుంచి వీరిపై ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడవారు రాజ్యమేలడంతోనే ఇక్కడ కూల్చివేతలు జరిగాయని కొందరు అభిప్రాయ పడుతున్నారు. లైసెన్స్‌లు కలిసి ఉన్న స్టాళ్ల యజమానులు నెల రోజుల క్రితం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్‌ను ఆశ్రయించారు. ఇక్కడ అనధికారంగా ఉంటున్న స్టాంప్ వెండర్లకు సికింద్రాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అండగా ఉన్నట్టు తెలిసింది. ప్రతి నెలా టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్టాంప్ వెండర్ల నుంచి మామూళ్లు తీసుకుంటున్నారని విశ్వసనీయ సమాచారం.


కోర్టు బయట స్టాంప్ వెండర్ స్టాల్స్‌ను కూల్చివేసిన జీహెచ్‌ఎంసీ

నకిలీ పత్రాలతో స్థలాన్ని కాజేసిన ఆర్మీ మాజీ కెప్టెన్

● అడ్డుకున్న అసలు యజమానికి చంపుతామని బెదిరింపులు

● ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన పోలీసులు

మారేడ్‌పల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): .నకిలీ పత్రాలు సృష్టించి ఖాళీ స్థలాన్ని కాజేసేందుకు ప్రయత్నించిన మాజీ ఆర్మీ కెప్టెన్‌తో పాటు మరో దళారిని అరెస్టు చేసి రిమాండ్ తరలించిన సంఘటన కార్ఖానా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఏసీపీ రమేష్, ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కార్ఖానా గన్‌రాక్‌లో మాజీ ఆర్మీ కెప్టెన్ డీకే గిరి నివాసం ఉంటున్నాడు. ఇతనికి సింధు కాలనీలో నివాసముంటున్న అశోక్ రామ్చంద్ సంబాని అనే రియల్ ఎస్టేట్ మధ్యవర్తి పరిచయం ఉంది. గన్‌రాక్‌లో కెప్టెన్ గిరి, తన ఇంటి పక్కనే ఉన్న ఎయిర్‌ఫోర్స్ మాజీ అధికారి రామానంద్ శంకర్‌కు చెందిన 450 గజాల ఖాళీ స్థలంపై కన్నేశాడు. రామానంద్ శంకర్ ఆగస్టు 2023లో చనిపోయారు. రామానంద్ చనిపోక ముందే అమెరికాలో ఉంటున్న తన కుమారుడికి ఖాళీ స్థలాన్ని వారసత్వంగా రాసి ఇచ్చారు. రామానంద్ కుమారుడు తన మేనమామ సుధాకర్‌ను స్థలాన్ని చూసుకోమని, దానికి సంబంధించి జీపీఏ చేశాడు. స్థలం ఖాళీగా ఉండటం, పట్టించుకునేవారు లేకపోవడంతో ఇంటిపక్కనే ఉన్న ఖాళీ స్థలంపై కెప్టెన్ గిరి కన్నేశాడు. మధ్యవర్తి సాయంతో తనకు పరిచయమున్న అశోక్ పేరుతో నకిలీ సేల్ డీడ్ సృష్టించాడు. కెప్టెన్ గిరి స్థలాన్ని కొనుగోలు చేశానని ఈ పత్రాలను చూపుతూ నిర్మాణాలు చేపట్టాడు. ముందు జాగ్రత్తగా నకిలీ డాక్యుమెంట్లతో హైకోర్టును ఆశ్రయించి అనుకూలంగా తీర్పు వచ్చేలా చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న జీపీఏ హోల్డర్ సుధాకర్ అతడి స్థలం వద్దకు వెళ్లి నిలదీశాడు. రామానంద్ జయకర్ మృతి చెందకముందే తనకు స్థలం అగ్రిమెంట్ చేసి అమ్మారని కెప్టెన్ దబాయించాడు. నకిలీ పత్రాలు, కోర్ట్ ఆర్డర్ చూపుతూ స్థలం తనదే అని వాదించడంతోపాటు, స్థలం జోలికి వస్తే తన లైసెన్స్ ఆయుధంతో చంపుతానని సుధాకర్‌ను బెదిరించాడు. దాంతో బాధితుడు సుధాకర్ కార్ఖానా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన కార్ఖానా పోలీసులు కెప్టెన్ గిరి వద్ద ఉన్నవి నకిలీ డాక్యుమెంట్లుగా, పత్రాల్లో ఉన్నవి ఫోర్జరీ సంతకాలుగా గుర్తించారు. నకిలీ పత్రాలతో స్థలం కబ్జా చేసిన గిరి, సహకరించిన అశోక్ లపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్లు సీఐ రామకృష్ణ తెలిపారు.

జీరో ఎన్‌బీడబ్ల్యూ రికార్డు సాధించిన రాచకొండ కమిషనరేట్

● 40 రోజుల్లో 2024 ఎన్‌బీడబ్ల్యూ కేసులు పరిష్కారం

● నిందితులను కోర్టులో హాజరుపరిచిన పోలీసులు

● సిబ్బందిని అభినందించిన రాచకొండ సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ. జూలై 5 (ఆంధ్రజ్యోతి): నేరచరిత్ర కలిగిన వారు సమాజంలో తిరగడం వల్ల ప్రజలకు, ఆయా కేసుల్లో సాక్షులకు ఇబ్బందికరంగా మారుతోందని, ఈ సమస్యపై దృష్టి పెట్టి పెండింగ్‌లో ఉన్న అన్ని నాన్‌బెయిలబుల్ వారెంట్‌ల కేసులు పరిష్కారం చేశామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. నాగోల్‌లోని ఓ హోటల్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీపీ మాట్లాడుతూ న్యాయస్థానంలో కేసుల విచారణ సందర్భంలో నిందితులు ఉద్దేశపూర్వకంగా హాజరు కాకుండా తప్పించుకుంటున్నారని, దీంతో కేసుల విచారణలో జాప్యం జరుగుతోందన్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో 50,249 కేసులకు సంబంధించి కోర్టుల్లో విచారణ జరుగుతోందన్నారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా, కేసు విచారణను జాప్యం చేస్తుండటంతో న్యాయస్థానాలు వారిపై నాన్‌బెయిలబుల్ వారెంట్‌లు(ఎన్‌బీడబ్ల్యూ)లు జారీ చేశాయన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో కమిషనరేట్ పరిధిలో 1088 ఎన్‌బీడబ్ల్యూలు పెండింగ్‌లో ఉండగా, ఏప్రిల్‌కు వీటి సంఖ్య 2024కు చేరిందన్నారు. దీనిపై దృష్టి సారించి ఈ కేసులను లాంగ్ పెండింగ్, గ్రేవ్, నాన్‌గ్రేవ్, కమిషనరేట్ పరిధి, ట్రై కమిషనరేట్ పరిధి, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు విభజించి కార్యచరణ ప్రారంభించామన్నారు. కేసులను పరిష్కరించేందుకు ఎస్సై, నలుగురు కానిస్టేబుళ్లతో కూడిన 14 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రత్యేక బృందాలకు అవసరమైన వాహనాలు ఇతర అలవెన్స్‌లు అందించి ఇతర రాష్ట్రాలకు పంపామన్నారు. ప్రత్యేక బృందాలకు చెందిన సిబ్బందిని ఏపీ, మహారాష్ట్ర, రాజస్థాన్‌లకు పంపి నిందితులను పట్టుకొని కోర్టులో హాజరు పరిచామన్నారు. రికార్డుస్థాయిలో 40రోజుల వ్యవధిలో 2024 ఎన్‌బీడబ్ల్యూ కేసులను పరిష్కరించామన్నారు. తప్పించుకుతిరుగుతున్న మరో 823 కేసుల్లో నిందితుల ఆచూకీ తెలుసుకునేందుకు ప్రకటనలు జారీచేశామన్నారు. జూలై చివరికి 2847 కేసులకు సంబంధించి దర్యాప్తు పూర్తి చేసి, జీరో ఎన్‌బీడబ్ల్యూ సాధించిన కమిషనరేట్‌గా చరిత్ర సృష్టించామన్నారు. నాన్‌బెయిలబుల్ వారెంట్‌లు జారీ అయినా పరారీలో ఉన్న నిందితులకు పూచికత్తు ఇచ్చిన వారికి నోటీసులు జారీ చేశామని తెలిపారు. పరారీలో ఉన్న నేరగాళ్ల, షూరిటీ ఇచ్చిన వారి ఆస్తులు జప్తు చేసేందుకు న్యాయ ప్రక్రియ ప్రారంభించామని తెలిపారు. ఎన్‌బీడబ్ల్యూ కేసులను పరిష్కరించడం ద్వారా న్యాయస్థానాల్లో కేసుల విచారణ వేగం పుంజుకుంటుందని, కేసుల్లో నిందితులకు శిక్షలు పడతాయన్నారు. నేరగాళ్లు సమాజంలో తిరగకుండా చేయడం ద్వారా ప్రజలు, ఆయా కేసుల్లో సాక్షులు ఎలాంటి ఆందోళన లేకుండా ఉంటారన్నారు. అంతేకాకుండా ఎన్‌బీడబ్ల్యూ పెండింగ్‌లో ఉన్న పాత నేరస్తులు ఇతర నేరాలు చేయకుండా నిరోధించ వచ్చని తెలిపారు. ఈ సందర్భంగా మంచి పనితీరును ప్రదర్శించిన ప్రత్యేక బృందాల అధికారులు, సిబ్బందికి రివార్డులు అందించారు.

● గత ఏడాది నుంచి చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న 1408 ఎన్‌బీడబ్ల్యూ కేసులను పరిష్కరించారు.

● దర్యాప్తులో నాన్‌బెయిలబుల్ వారెంట్‌లు పెండింగ్‌లో ఉన్న 52 మంది చనిపోయారని పోలీసులు నిర్ధారించారు.

● ఎన్‌బీడబ్ల్యూ పెండింగ్‌లో ఉన్న 14 మంది ఇతర కేసుల్లో జైలు శిక్షలు అనుభవిస్తున్నారు.● 13 కేసుల్లో పరారీలో ఉన్న నేరస్తులకు జామీను (షూరిటీ) ఇచ్చిన వారికి నోటీసులు జారీ చేశారు.



వివరాలు వెల్లడిస్తున్న సీపీ సుధీర్‌బాబు

ఆంజనేయస్వామి ఆలయంలో అభివృద్ధి పనులు

బోయినపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ తాడ్‌బండ్ ఆంజనేయ స్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు సదా కేశవరెడ్డి సొంత నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ గర్భగుడి వెనుక భాగాన శనివారం ఎండోమెంట్ ఈఈ వేమూరి శ్రీనివాస్ శర్మ, ఆలయ ఈఓ నరేందర్, కంటోన్మెంట్ బోర్డు మాజీ సదాకేశవరెడ్డిలు పరిశీలించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ రోజురోజుకు భక్తుల రద్దీ పెరిగిపోతుండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గర్భగుడి వెనుక 1928 నుంచి ప్రాచుర్యంలో ఉన్న పురాతన బావిని బంగారు బావిగా తీర్చిదిద్దటంతో పాటు, సుమారు ఇరవై గజాల వెడల్పుతో ఈ ప్రాంతంలో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఆలయ ఈఓ నరేందర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు పనులు వీలైనంత త్వరితగతిన పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎండోమెంట్ ఎఈ ఆర్ రామారావు, ఎ. సంజీవ్ కుమార్, శ్రీనివాస్, అశోక్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న కేశవరెడ్డి, ఏఈఈ ఆర్. వేమూరి శ్రీనివాస్ శర్మ, ఈఓ నరేందర్

కూలిన భారీ వృక్షం.. తప్పిన ప్రమాదం

అడ్డగుట్ట, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : తుకారాంగేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తుకారాంగేట్ చౌరస్తా ఆటోస్టాండు వద్ద నడిరోడ్డుపై ఓ భారీ వృక్షం కూలిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న గోపాలపురం ట్రాఫిక్ సీఐ భాస్కర్, ఎస్సై శ్రీధర్ పాటు తుకారాంగేట్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో చెట్టును తొలగించారు. ఫిర్యాదు అందుకున్న గోపాలపురం పోలీసులు అగరంటలో ఆ ప్రాంతంలో రాకపోకలకు వినియోగంలోకి తీసుకురావడంతో స్థానికులు గోపాలపురం, తుకారాంగేట్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఫిర్యాదు అందుకున్న ట్రాఫిక్ పోలీసులు స్పందించడం ఆనందంగా ఉందని స్థానికులు తెలిపారు.


తుకారాంగేట్‌లో కూలిన భారీ వృక్షం

ప్రమాణ స్వీకారం

భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడుగా ఎన్. రాంచందర్‌రావు ప్రమాణ స్వీకారం చేసేందుకు శనివారం తార్నాకలోని తన నివాసం నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ మాజీ మేయర్ బండ కార్తీకా రెడ్డి, తార్నాక డివిజన్ అధ్యక్షుడు బండారి ఉపేందర్ యాదవ్, వెంకటేశ్ గౌడ్, వీరన్న, పోచయ్య యాదవ్, గణేష్ ముదిరాజ్, రాముపర్మ తదితరులు పాల్గొన్నారు. - తార్నాక, ఆంధ్రజ్యోతి



ఎంఎస్‌పీ సికింద్రాబాద్ కో-ఇన్‌చార్జి నియామకం

బౌద్ధనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మహాజన సోషలిస్ట్ పార్టీ(ఎంఎస్‌పీ) సికింద్రాబాద్ నియోజకవర్గ కో-ఇన్‌చార్జిగా సీతాఫల్‌మండి బీదలబస్తీకి చెందిన నందారం సీతారాంమాదిగ నియామితులయ్యారు. ఎంఎస్‌పీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర కో-ఆర్డినేటర్ ఇంజ వెంకటస్వామి మాదిగ నందారం సీతారాంమాదిగను కో-ఇన్‌చార్జిగా నియామిస్తూ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 31వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను 7న ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు టి.నరసింహ మాదిగ, సికింద్రాబాద్ ఇన్‌చార్జి ఎన్.విజయరావు మాదిగ, భూపతి సుజాత తదితరులు సీతారాం మాదిగను అభినందించారు.


సీతారాం మాదిగ


మొక్కలు నాటడం వల్ల కలిగే ఉపయోగాలపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలపై ర్యాలీ

బౌద్ధనగర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చెట్లు నాటడం, పెంచటం వల్ల కలిగే ఉపయోగాలపై బౌద్ధనగర్‌లో భారతీ విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు శనివారం ర్యాలీని నిర్వహించారు. స్కూల్ కరస్పాండెంట్ పి.చంద్రమోహన్, ప్రిన్సిపాల్ సాయిలక్ష్మీ ఆధ్వర్యంలో చెట్లు పెంచటం వల్ల ఉపయోగాలపై విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని బౌద్ధనగర్, అంబర్‌నగర్, వారాసిగూడ ప్రాంతాల్లో ర్యాలీని నిర్వహించారు. అనంతరం బౌద్ధనగర్ పార్కులో ఉపాధ్యాయులు, విద్యార్థులు చెట్లను నాటారు.

మర్యాద పూర్వక కలయిక

తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను జాగృతి ఉపాధ్యక్షురాలు మంచాల వరలక్ష్మి మర్యాద పూర్వకంగా కలిశారు.

- పద్మారావునగర్, ఆంధ్రజ్యోతి

